1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health

Best for Readers

THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 160 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 26 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 160 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 26 April 2025 PAGES : 8 PRICE : 3/-

## అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాలకు



# ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

**ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన**

**ప్రధాని మోదీతో సమావేశం**

**వివిధ అంశాలపై చర్చ**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 25)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు గంటన్నర పాటు సాగింది. ఈ సందర్భంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా మే 2వ తేదీన తలపెట్టిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని, వాటికి ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండడం తెలిసిందే. ఇందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసింది.ప్రధానితో చంద్రబాబు భేటీలో అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పురోగతి, రాష్ట్రానికి సంబంధించిన ఇతర కీలక ప్రాజెక్టులు, ఆర్థిక వనరులు, విభజన హామీలు వంటి మిగతా 2లో

## పిఠాపురంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం పవన్

**సొంత నియోజకవర్గంపై పవన్ కల్యాణ్ దృష్టి**

**30 పడకల ఆసుపత్రిని మరింత అప్ గ్రేడ్**

**మోదీ, చంద్రబాబు నాయకత్వంలో పిఠాపురంను మరింత అభివృద్ధి చేస్తామన్న పవన్**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 25)**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, పిఠాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచుతూ చేపట్టిన నిర్మాణ పనులకు ఆయన నేడు శంకుస్థాపన



చేశారు. ప్రస్తుతం 30 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి పిఠాపురం టీడీపీ ఇన్చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల నాయకత్వంలో పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. 30 పడకల ఆసుపత్రిని 100 పడకలకు పెంచడం ఈ అభివృద్ధి ప్రస్థానంలో ఒక భాగమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన ఉద్ఘాటించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి పని చేస్తున్నాం" అని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.పిఠాపురంలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి స్థాయిని పెంచుతున్నామని, దీనివల్ల స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పాక్ జాతీయుల వీసా సస్పెన్షన్లు సీఎంలతో మాట్లాడిన అమిత్‌షా..

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 25)**

ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆయన శుక్రవారం



మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని మిగతా 2లో

## డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్... ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

**బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్.**

**సచివాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సవిత**

**బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'ఆచార్య' యాప్ ద్వారా శిక్షణ.**

**నెలకు రూ.1500 ఉపకార వేతనం,**

**పుస్తకాలకు అదనంగా రూ.1000.**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 25)**



రాష్ట్రంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి సవిత తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆమె ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బీసీ స్టడీ సర్కిల్ పర్యవేక్షణలో, శామ్ ఇన్‌స్టిట్యూట్ వారు రూపొందించిన 'ఆచార్య' యాప్ ద్వారా ఈ శిక్షణను మిగతా 2లో

## ఇంట్లో ఐఈడీలు పెట్టి.. భద్రతా దళాలకు పహల్గాం ఉగ్రవాదుల ట్రాప్..?

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 25)**

భద్రతా దళాలు తనను వెతుక్కుంటూ ఇంటికి వస్తారని అంచనా వేసిన పహల్గాం దాడి ఉగ్రవాది ఆసీఫ్ ఫౌజీ.. వారికి ట్రాప్ పెట్టాడు. అయితే త్రుటిలో ఆ ప్రమాదం నుంచి భద్రతా సిబ్బంది తప్పించుకోగలిగారు. ఇలాగే మరో ఉగ్రవాది ఇంట్లోనూ జరగడం గమనార్హం. దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌కు చెందిన ఆసిఫ్ ఫౌజీ అలియాస్ ఆసిఫ్ షేక్ (%జురీరితీ ఐనీలిరిదినీ%), ఆదిల్ థోకర్ అలియాస్ ఆదిల్ గురి అనే ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లల్లో సోదాలు జరపడానికి జమ్మూకశ్మీర్ పోలీసులు వెళ్లారు.



తనిఖీలు చేస్తున్న సమయంలో ఉగ్రవాదుల నివాసాల్లో అమర్చిన పేలుడు పదార్థాలు యాక్టివేట్ అయినట్లు గుర్తించారు. దీంతో వారు వెంటనే బయటకు రాగా.. కాసేపటికే భారీగా పేలుళ్లు సంభవించాయి. గాలింపు చర్యలకు వచ్చిన సమయంలో వారికి హాని కలిగించాలనే ఉద్దేశంతోనే ఉగ్రవాదులు ముందుగానే తమ ఇళ్లల్లో పేలుడు పదార్థాలు అమర్చి.. ఈ నివాసాల సమాచారం భద్రతా దళాలకు అందేలా ప్లాన్ చేసి ఉంటారని ఓ పోలీసు అధికారి మీడియా వద్ద అనుమానం వ్యక్తం చేశారు. ఆదిల్ 2018లో చట్టబద్ధంగా పాకిస్థాన్ వెళ్లి, గతేడాది జమ్మూకశ్మీర్‌కు తిరిగి వచ్చాడని.. ఇన్నాళ్లు అక్కడ ఉగ్రవాద శిబిరాల్లో శిక్షణ పొందాడని అధికారులు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసిఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు పీటీఐ పేర్కొంది. మిగతా 2లో

# వెంటాడుతాం.. వెన్నువిరుస్తాం..

**ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 25)**

జమ్మూకశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను హరించిన ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి మరీ శిక్షిస్తామని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ముష్కరులకు, ఉగ్రవాదానికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని



ప్రస్తావిస్తూ హంతకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ..."ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు దేశమంతా అండగా ఉంది. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన దుస్సాహసం" అని పేర్కొన్నారు. 'ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది ప్రజలు విరిచేస్తారు" అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. "మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ అండగా నిలిచారు. మిగతా 2లో

## భద్రత వైఫల్యాలను సమీక్షించాలి

**- ఇది మన గణతంత్రంపైనే ఉగ్రదాడి -దానినీ భాజపా రాజకీయం చేస్తోంది**

**వర్కింగ్ కమిటీలో కాంగ్రెస్ తీర్మానం**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 25)**

అమాయక పర్యాటకులను కశ్మీర్‌లో ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడం మన గణతంత్ర విలువలపై నేరుగా జరిగిన దాడి అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పేర్కొంది. పహల్గాంలో పిరికిపంద చర్య వెనుక పాకిస్థాన్ కుట్ర ఉందని ఆరోపించింది. ఇంతటి విషాదకర ఘటన సమయంలో ఐక్యత అవసరం కాగా దీనిలోనూ మతప్రాతిపదికన విభజన తీసుకువచ్చి రాజకీయ లబ్ధి పొందడానికి భాజపా ప్రయత్నిస్తోందని విమర్శించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన గురువారం దిల్లీలో పార్టీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశమైంది. పార్టీ మిగతా 2లో




## కనీస ఓట్లు సాధిస్తేనే ఏకగ్రీవ ఎన్నిక

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 25)**

ఎన్నికల బరిలో ఒకడే అభ్యర్థి పోటీలో మిగిలిన సందర్భాల్లో ఆ అభ్యర్థి కొంత శాతం కనీస ఓట్లు సాధిస్తేనే ఏకగ్రీవంగా గెలిచినట్లు ప్రకటించేలా నిబంధనలు ప్రతిపాదించాలని సుప్రీంకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 53(2) సెక్షన్ చెల్లుబాటు విషయమై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణలో భాగంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడుకున్న ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఇప్పటివరకూ పార్లమెంటరీ ఎన్నికల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భాలు తొమ్మిది మాత్రమే ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. శాసనసభ ఎన్నికల్లో ఏకగ్రీవ ఎన్నికలు సాధారణమేనని పిటిషనర్ అయిన 'విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ' సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అరవింద్ దాతార్ అన్నారు. ఒక అభ్యర్థి అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగపరచి ఇతర అభ్యర్థుల్ని బరిలోంచి తొలగిపోయేలా చేస్తే దానికి పరిష్కారమేమిటని ప్రశ్నించారు. మిగతా 2లో

## ఎన్నారైలపై జగన్ విషం చిమ్ముతున్నారు

**వైసీపీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందన్న చిన్ని**

**అమరావతికి నిధులు రాకుండా జగన్ అడ్డుకుంటున్నారని విమర్శలు**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 25)**

వైసీపీ హయాంలో ఏపీలో భారీ మద్య కుంభకోణం జరిగిందని విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని ఆరోపించారు. మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఎన్నారైలపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. ప్రవాసాంధ్రులపై విషం చిమ్మితే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి నిధులు రాకుండా జగన్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని కేశినేని చిన్ని ఆరోపించారు. రాష్ట్రానికి, రాష్ట్రంలోని నిరుద్యోగులకు నష్టం చేకూరేలా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

## మొదటిపేజీ తరువాయి

## పాక్ జాతీయుల వీసా సస్పెన్షన్లు సీఎంలతో మాట్లాడిన అమిత్‌షా..

వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం ఉంది. ఇక పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ పేర్కొంది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది. అదే సమయంలో ఇక్కడ పాక్ జాతీయులు గడువు ముగిసేలోపు దేశం విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది అమాయకుల ప్రాణాలు తీయడంతో భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో పాక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ నిర్ణయించింది. దీంతో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు.. పాక్ జాతీయులు భారత్‌ను వీడాలని నిర్ణయం తీసుకుంది.

## డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్... ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు.ఈ ఆన్‌లైన్ కోచింగ్ 24 గంటల పాటు అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని మంత్రి సవిత పేర్కొన్నారు. అనేకమంది అభ్యర్థులు, ముఖ్యంగా గృహిణులు, సుదూర ప్రాంతాల్లో నివసించేవారు, చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు ఆఫ్ లైన్ కోచింగ్ కు హాజరుకాలేక ఇబ్బంది పడుతున్నారని, వారి విజ్ఞప్తి మేరకే ఈ ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఎప్పుడైనా, ఎక్కడ నుంచైనా కోచింగ్ పొందే వీలు కల్పించినట్లు చెప్పారు.శిక్షణ కాలంలో అర్హులైన అభ్యర్థులకు నెలకు రూ. 1500 చొప్పున ఉపకార వేతనం, పుస్తకాల కొనుగోలు నిమిత్తం అదనంగా మరో రూ. 1000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనలు, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్స్, గత డీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంచుతామని ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. శామ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఈ రంగంలో విస్తృతమైన అనుభవం ఉందని, అందుకే ఈ బాధ్యతను వారికి అప్పగించినట్లు తెలిపారు.

## కనీస ఓట్లు సాధిస్తేనే ఏకగ్రీవ ఎన్నిక

**పరిష్కరిస్తే పెద్ద సంస్కరణే**

ఎన్నికల కమిషన్ ఈ విషయాన్ని పరిష్కరిస్తే అదొక పెద్ద సంస్కరణ కాగలదని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "రాజకీయ రంగంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ధనికుడైన ఒక అభ్యర్థి బరిలోని మిగతా అభ్యర్థులందరినీ పోటీ నుంచి విరమించేలా ఒత్తిడిచేసి ఒక్కడే పోటీలో మిగిలితే... బరిలో మిగిలిన అభ్యర్థికి ఓటేయడం తప్ప ఓటరుకు మరో గత్యంతరం ఉండదు. అలాంటి సందర్భాల్లో ఆ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించాలి. అలా జరిగితే తమకు నచ్చిన అభ్యర్థికి ఓటేసే అవకాశమే ఓటర్లకు లభించదు' ' అని న్యాయమూర్తి అన్నారు. కనీసం 5 శాతం ఓట్లూ సాధించని అభ్యర్థి పార్లమెంటులోకి అడుగుపెట్టే అవకాశం ఎందుకు కల్పించాలని ప్రశ్నించారు. అందుకే కనీస ఓట్లు సాధించినప్పుడే అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించే నిబంధన అవసరమన్నారు.

## వెంటాడుతాం.. వెన్నువిరుస్తాం..

వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా" అని మోదీ స్పష్టం చేశారు.

**ప్రపంచానికి సూటి సందేశం**

ప్రధాని మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. మధుబని సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది. "ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడుతాం. వారిని శిక్షించకుండా వదిలిపెట్టబోం" అని ప్రధాని మోదీ ఆంగ్లంలో పేర్కొన్నారు.

**గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి**

బిహార్‌లో రూ.13,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఐక్యంగా ఉందని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ తెలిపారు.

## ఇంట్లో ఐఈడీలు పెట్టి.. భద్రతా దళాలకు పహల్గాం ఉగ్రవాదుల ట్రాప్..?

ఆదిల్ థోకర్ అనే మరో ఉగ్రవాదికి కూడా వీరితో సంబంధం ఉందని తెలిపింది. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో సభ్యులు. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ ఊహా చిత్రాలను గీశారు. టెర్రరిస్టులు పురుషులను వేరు చేసి వారి గుర్తింపులను పరిశీలిస్తున్న సమయంలో బాధితులు వారి ముఖాలను చూశారు. ఈ ఫొటోల ఆధారంగా వీరి కోసం భద్రతా సిబ్బంది వేట మొదలుపెట్టారు.

## భద్రత వైఫల్యాలను సమీక్షించాలి

అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, ఇతర సీనియర్ నాయకులు దీనిలో పాల్గొన్నారు. మూడంచెల భద్రత ఉండాల్సిన పహల్గాంలో దారుణమైన దాడి జరగడం వెనక నిఘా, భద్రత వైఫల్యాలపై సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని వర్కింగ్ కమిటీ అభిప్రాయపడింది. అప్పుడే మృతుల కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతుందని పేర్కొంది. త్వరలో ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భక్తుల భద్రతపై తక్షణం దృష్టి సారించాలని సూచించింది.

**మృతులకు నివాళి**

పహల్గాం మృతులకు సీడబ్ల్యూసీ నివాళులర్పించింది. ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం రాత్రి దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో, జిల్లా కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించింది. శుక్ర, శనివారాల్లో జరగాల్సిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలను వాయిదా వేసి, 27 నుంచి కొనసాగించనుంది. సమావేశ వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తదితరులు విలేకరులకు వివరించారు. ముష్కరులు ఉద్దేశపూర్వకంగా హిందువుల్ని లక్ష్యంగా చేసుకోవడం వెనుక దేశంలో ఉద్రిక్తతను ఎగదోసే దురుద్దేశం ఉందన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని దృఢసంకల్పంతో అణచివేయాలనేది తమ పార్టీ డిమాండుగా చెప్పారు. ఆ ప్రాంతంలో భద్రత ఎందుకు కల్పించలేదన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని పార్టీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ డిమాండ్ చేశారు.

## అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాలకు ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

పలు అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర సహకారం ఆశిస్తున్నట్లు సీఎం ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. ప్రధానితో భేటీ సానుకూల వాతావరణంలో జరిగినట్లు సమాచారం.

**మోదీ రాక... భారీ ఏర్పాట్లకు ప్రణాళికలు**

అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెలగపూడిలోని సచివాలయం వెనుక భాగంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ బహిరంగ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే రోజున దాదాపు 30 వేల మందితో ఒక రోడ్‌షో నిర్వహించాలని కూడా యోచిస్తున్నారు. ఇందులో మోదీ, చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రారంభమయ్యే లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు సూచికగా ప్రధాని మోదీ ఒక పైలాన్‌ను కూడా ఆవిష్కరించనున్నారు.

## మతం అడిగి మరీ చంపారు

### ఉగ్రవాదుల కాల్పులో చనిపోయిన మధుసూదన్ భార్య కామాక్షి ప్రసన్న




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)

ఉగ్ర దాడిలో కావలికి చెందిన మధుసూదన్ చనిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ఆమె పత్రికా విలేకరులతో కావలిలో మాట్లాడారు. మధుసూదన్ భార్య అక్కడ జరిగిన సన్నివేశాన్ని పూర్తిగా విలేకరులకు వివరించారు. తమ పిల్లలకు స్కూలు సెలవులు ప్రకటించడంతో తాము మూడు కుటుంబాలతో కలిసి కాశ్మీర్‌కు వెళ్లాం. ముందుగా శ్రీనగర్ చూసుకొని పెహల్‌గాం చేరుకున్నాం. కాల్పులు సౌండ్ రావడంతో పరిగెత్తి వెళ్లేందుకు ట్రై చేసాం. ఈ లోపల ఉగ్రవాదులు వచ్చి మమ్మల్ని మీది ఏ మతం అని అడిగాడు. అనంతరం మతం పేరు చెప్పడం తోటే నా భర్తను చంపేశారు. అని కన్నీళ్ల పర్వతంతో విలేకరుల ముందు కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా తన భర్తకు జరిగిన అన్యాయం మరెవరికి జరగకూడదని, ఈ దేశంలో ఉగ్రవాదమే లేకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. వీధిన పడిన తమ కుటుంబాన్ని అన్ని విధాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆమె కోరారు.

## ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన సాంఘిక సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు కలెక్టర్ ఓ ఆనంద్ ప్రశంసలు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థినీ,విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఎంపీసీ పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ కేంద్ర ప్రభుత్వ హాస్టల్ విద్యార్థినిలు యాదల సంగీత, సి ఇసిలో 927 మార్కులు సాధించిన బద్దిపూడి మేఘన, అలాగే పదవ తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్. కాజోల్ లక్ష్మి అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటెరు సాయి ధనుష్ తదితరులకు జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి పాల్గొన్నారు.



## ఆదరణ టూ పథకంలో అధికారుల అవినీతి వాటాపై నిగ్గుతేలాలి

### లేకుంటే బీసీ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తాం

### నాయి బ్రాహ్మణ అభివృద్ధి, సమాచార వేదిక నాయకుడు కడవకుదురు అంజిబాబు హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

ఆదరణ టూ పథకాలలో నాయీ బ్రాహ్మణులకు గతంలో నాసిరకం పనిముట్లు ఇచ్చి నాయీ బ్రాహ్మణ కులాన్ని అవమానించరని ఆ విషయంలో నాయి బ్రాహ్మణ డైరెక్టర్లు, అధికారులతో కుమ్మక్కయ్ అవినీతికి పాల్పడ్డారని అన్నారు పంచాయతీరాజ్ విశ్రాంతి భవనంలో నాయి బ్రాహ్మణ అభివృద్ధి సమాచార వేదిక ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ అభివృద్ధి, సమాచార వేదిక ప్రకాశం జిల్లా నాయకుడు కడవకుదురు అంజిబాబు తదితరులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు నాసిరకం పనిముట్లు ఇచ్చి బీసీ కార్పొరేషన్ అధికారులతో కూర్చుని పెద్ద స్థాయిలో అవినీతి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ విషయంలో బీసీ కార్పొరేషన్ ముట్టడికి తమ వెనుకాడబోమని వారు పేర్కొన్నారు. ఆదరణ పథకం ముఖ్య ఉద్దేశం లబ్ధిదారు దగ్గర 10 శాతం డబ్బులు తీసుకుని 90 శాతం ప్రభుత్వమే సబ్సిడి చెల్లించి కులవృత్తి చేసుకొని జీవనం సాహించే వారికి నాణ్యమైన పనిముట్లు అందజేయడం ప్రభుత్వ లక్ష్యమని అందుకు విరుద్ధంగా జరుగుతుందని అన్నారు. తమకు ఇచ్చిన క్షవరపు కుర్చీలు, డోలు సన్నాయిలు, ఎందుకూ పనికి రాకుండా పోయాయని, నాయి బ్రాహ్మణ డైరెక్టర్ రెండు లక్షల తీసుకుని బెంగళూరు మద్రాసు తిరిగి నాసిరకం కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చి అధిక మొత్తంలో కమిషన్ తీసుకొని కులానికి చెందాల్సిన డబ్బులు తినేశారని దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నిడమనూరి ఆనంద్ బాబు, ఏల్చూరి వెంకటేశ్వర్లు, పతకమూరి శేఖర్ బాబు, ఏల్చూరి శేషగిరి బాబు, గుంటూరు మస్తాన్రావు, వల్లూరి రాము, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

### జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 25)

జమ్ము కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణం నందు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం దాడికి గురైన మృతుల పట్ల మౌనం పాటించి, అదే దాడిలో మరణించిన జనసేన కార్యకర్త సోమిశెట్టి మధుసుధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ ఉగ్రవాదులు ఎక్కడ ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని, శాంతియుత భావంతో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్న మన భారతదేశంలో ఇలాంటి ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, కులాలకు, మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ మృతి చెందిన మన భారతీయుల కుటుంబాలకు భరోసా ఇవ్వాలని, ఎన్డీఏ ప్రభుత్వం నేతృత్వంలో భారత ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంటుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్ సింగ్, జిల్లా కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, జనసేన నాయకులు విజయరావు నరసింహారావు, పఠాన్ షఫీ, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, ఉమ్మడి రవీంద్ర, కంబం వెంకట రమణ, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు వీరిశెట్టి శ్రీను ఆవుల వెంకట్, బట్టగిరి మురళీధర్ రెడ్డి, వెలుగు కాశీరావు, గుండెబొమ్ము శ్రీను, సునీల్, మహేష్, రసూల్, జనసేన వీర మహిళలు జనసేన వీర మహిళలు పిన్నెబోయిన లక్ష్మీ రాజ్యం, పూజా లక్ష్మీ, వాసవి ప్రియా, బాలబాయి, నాయకులు పిచ్చయ్య, శివ సింగ్, మణికంఠ ఈర్ణపాటి సుబ్బారావు, రఘు, అనిల్ మరియు జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.








## కలెక్టర్ తమీమ్ అన్సారీయాను కలిసిన పొదిలి కమిషనర్ నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాను పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కె ఎల్ నారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కమిషనర్ నారాయణరెడ్డిని పొదిలి నగర పంచాయతీ పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.


షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

ప్రకాశం


# మన ఎమ్మెల్యే "ఉగ్ర" డేరింగ్ అండ్ డాషింగ్

### వైసీపీ ఎంపిపి "ప్రకాశం" ప్రశంసలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 25)

ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఉగ్ర శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో జరిగిన ఈ ప్రజా దర్బార్‌కు కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అర్జీదారులు హాజరయ్యారు. ఈ ప్రజాదర్బార్‌లో రెవెన్యూ సమస్యల పై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. ప్రజాదర్బార్‌కు హాజరైన కనిగిరి మండల ఎంపిపి డి ప్రకాశం ప్రజాదర్బార్ ముగింపు ఎంపిపి డి ప్రకాశం మైకు తీసుకుని మన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి డేరింగ్ అండ్ డాషింగ్ అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. కొన్నేళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తున్న మన ఎమ్మెల్యే ఉగ్ర కు హాట్సాఫ్ అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. పది కాలాల పాటు ప్రజలకు గుర్తుండే బయోగ్యాస్ ప్లాంటు, హైవే రోడ్డు నిర్మాణం, రైల్వే లైను, ట్రిపుల్ ఐటిని సాధిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రకు మనమంతా రుణపడి ఉన్నామన్నారు. ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణం చేయించారని, వెనుకబడ్డ కనిగిరి ప్రాంత గ్రామాలకు ఇంకా మరిన్ని నిధులు తెచ్చి గ్రామాల రూపురేఖలు మారుస్తారన్న విశ్వాసం తనకుందని ఎంపిపి ప్రకాశం కితాబునిచ్చారు. తాజా, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ (తరువాయి 4లో...)

# ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, పరిశ్రమల శాఖ అధికారులతో, ఎపిఐఐసి అధికారులతో సమావేశమై, జిల్లాలో అమలు జరుగుచున్న ఆంధ్రప్రదేశ్ సింగిల్ డెస్క్ పాలసీ 2015, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, పిఎం విశ్వకర్మ యోజన, ఆంధ్రప్రదేశ్‌లో రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పనితీరు పథకం కింద ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్-కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, ఉద్యమ్ వర్క్ షాప్, ఎంఎస్ఎంఈ సర్వే, ఇన్సెంటివ్ రిలీజ్, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థల సేకరణ తదితర అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువమందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకనుగుణంగా యువతకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో జరుగుచున్న పిఎం విశ్వకర్మ యోజన స్టేజ్ 1 వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కుకు అవసరమైన స్థల సేకరణ, ప్రతిపాదనలు సిద్దం చేయాలని జిల్లా కలెక్టర్ ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



# సాముహిక గృహ ప్రవేశాల నిర్వహణే లక్ష్యం

### 8వేల 839 ఇళ్ల నిర్మాణాలు మే 31 వతేదీ నాటికి పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ మాసంలో 3 లక్షల గృహాలకు సాముహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, అందులో భాగంగా జిల్లాకు నిర్దేశించిన 8వేల 839 ఇళ్ల నిర్మాణాలు మే, 31 వతేదీ నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, మునిసిపల్ కమీషనర్లను, ఎంపిడిఓలను, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మునిసిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమై జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ మాసంలో 3 లక్షల గృహాలకు సాముహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో మే, 31 వతేదీ నాటికి జిల్లావ్యాప్తంగా 8 వేల 839 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనీ లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కేవలం 2 వేల 824 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేసి 32 శాతం మేర లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. ఇంకను 6,015 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, స్టేజి కన్వర్షన్ పై రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఇళ్ళ నిర్మాణాలన పురోగతిని వేగవంతం చేయాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకుని నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్ స్టేజ్ లో వున్న ఇళ్ళ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి అవి త్వరగా పూర్తీ చేసేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన లబ్దిదారులకు అందించే అదనపు ఆర్థిక సహాయంపై లబ్దిదారులకు అవగాహన కలిగించి, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం అయ్యేలా ప్రత్యక శ్రద్ద తీసుకోవాలన్నారు. జన్‌మన్ కార్యక్రమం కింద చేపట్టే గృహ నిర్మాణాలను త్వరగా పూర్తీ చేసేలా సంబంధిత మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గృహ నిర్మాణ లబ్దిదారులకు అందిస్తున్న 90 రోజుల పని దినాలు ప్రతి లబ్దిదారునికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, మెప్మా పిడి శ్రీహరి, ఒంగోలు మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వరావు, జిల్లాలోని మునిసిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, గృహ నిర్మాణ శాఖ కు సంబంధించిన ఈఈలు, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతి అమలుపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేసారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, డ్వామా అధికారులతో, ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు చేపట్టడానికి వేసవి కాలం అనుకూలం అయినందున పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకుని నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి హామీ పథకాల కింద చేపట్టిన పనుల పురోగతి సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. లేబర్ మొబిలైజేషన్ పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ లో త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్ళూరు, హెచ్ఎంపాడు, గిద్దలూరు మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి వున్నాయని, సంబంధిత ఎంపిడిఓ లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కూలీలకు రోజువారి సగటు వేతనం 307 తగ్గకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల, దొనకొండ, పామూరు, జరుగుమల్లి, పిసిపల్లి, తాళ్ళూరు, వై పాలెం, అర్ధవీడు మండలాల్లో గత వారం కంటే ఈ వారం కూలీలకు రోజువారి సగటు వేతనం తగ్గిందని, ఈ మండలాల్లో సగటు వేతనం తగ్గడానికి గల కారణాలను జిల్లా కలెక్టర్, సంబంధిత ఎంపిడిఓ లను, ఎపిఓ లను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన కారణాలపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉపాధి హామీ పనుల విధుల పట్ల కనీసం అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారు, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, ఎంపిడిఓ లను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు, ఫారం పాండ్ల నిర్మాణాలు, ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తి చేయుటకు ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలపై అవసరమైన మేరకు ప్రతిపాదనలు పంపాలన్నారు. గ్రామాల్లో వర్షం పడి ఎక్కడైతే నీరు నిలుస్తుందో ఆ ప్రదేశాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి యోజన పథకాలను ఉపాధి హామీ కూలీలకు వర్తించేలా క్షేత్ర స్థాయిలో ఎంపిడిఓ లు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఎంపిడిఓలు, ఏ.పి.డి.లు, ఏ.పి.ఓ.లు తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)



## ఉపాధి హామీ పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి



## మన ఎమ్మెల్యే "ఉగ్ర" డేరింగ్ అండ్ డాషింగ్

యాదవ్ ఏ పని చేయలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వలనే కనిగిరి అభివృద్ధి చెందుతుంది అన్న విధంగా ఎంపిపి మాట్లాడడం గమనార్హం. వైసీపీ ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాని ఈ ప్రజాదర్బార్‌లో ఎంపిపి ప్రకాశం పాల్గొని ఎమ్మెల్యేను పొగడ్తలతో ముంచెత్తడం అర్జీదారులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కనిగిరి అభివృద్ధే తన అజెండా అని స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

# వసతి భవనం కోసం వినతి

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)**

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 108 సిబ్బంది విశ్రాంతి భవనం కోసం తహసిల్దార్ వి పుల్లారావుకు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ విశ్రాంతి భవనం కోసం పై అధికారులకు మాట్లాడి విశ్రాంతిభవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, పిల్లి వెంకటనారాయణరెడ్డి, పల్లపోతు రమేష్ బాబు, పల్లపోతు వెంకట్రావు, మాదాల ప్రసాదు, దాసరి కృష్ణారావు, రమణయ్య, 108 సిబ్బంది కే వాసు బాబు, వి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.



# పెహల్గావ్ అమరులకు విశ్వహిందూ పరిషత్ పుష్పాంజలి

### ఉగ్రవాదులకు, ప్రేరేపితులకు తగిన గుణపాఠం తధ్యం

### కేంద్ర ప్రభుత్వ చర్యలకు మద్దతు తెలిపిన విహెచ్‌పి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

జమ్మూ కాశ్మీర్ పెహల్గావ్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల పాశావికదాడిలో అమరులైన హిందూ పర్యాటకులకు ఒంగోలు దక్షిణం బజారులోని వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద విశ్వహిందూ పరిషత్ ఒంగోలు జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జున రావు అధ్యక్షతన పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమానికి ముందుగా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు గాంధీ రోడ్డు గుర్రం వారి వీధి తదితర పరిసర ప్రాంత వీధులలో హిందూ బంధువులను జాగృతం చేసే విధంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు నశించాలి - అమరులైన హిందువులకు జోహార్ అంటూ నినాదాలు చేస్తూ కాలినడకన చుట్టివచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రాంత సత్సంగ్ ప్రముఖ సోమసుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం నశించాలి, ఉగ్రవాదులకు సహకరించే ఏ ఒక్క అన్య మతస్తులకు సహకారం అందించవద్దు, నీచులు, దుర్మార్గులు, ఈ ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా మగవారి వస్త్రాలను విప్పి సున్నతి చేసిలేదని, కల్మా పఠించడం రాదని వీరు హిందువే అని నిర్ధారించి నిర్ధాక్షిణ్యంగా క్రూరులై తుపాకీ గుండ్లను పేల్చి చంపడం, క్షంతవ్యం కాదు అంటూ కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉగ్రవాదులను, వారిని ప్రేరేపించిన వారిని తుదముట్టించాలని, భారతదేశం వైపు కన్నెత్తి చూడాలంటే గడగడలాడే విధముగా కూకటి వేళ్లతో పెకిలించాలని విజ్ఞప్తి చేశారు. అమాయక పర్యాటకులు, నూతన వధూవరులలో 27 మందిని మరో 40 మందిని క్షతగాత్రులను చేసిన ఉగ్రవాదులను విడిచి పెట్టేది లేదని సమస్త హిందూ సమాజం ప్రభుత్వానికి అండగా ముందుకు నడుస్తుందని జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జున్ రావు తెలిపారు. పరిషత్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు కార్యక్రమంలో పాల్గొని అమరులైన వారికి పుష్పాంజలి సమర్పించారు.





# ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 25)**

పొదిలి యుపీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుగుణ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం



సందర్భంగా యుపీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రపంచం వాప్తంగా మలేరియా నిర్మూలించే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007 సంవత్సరంలో ఏప్రిల్ 25న మలేరియా దినోత్సవంగా జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దోమల నుంచి రక్షణ పొందేందుకు పరిసరాలు పరిశుభ్రతతో పాటు ఇళ్ల సమీపంలో నీటి గుంటలు పనికిరాని డ్రమ్ములు వాటిల్లో నీటి నిలువ లేకుండా చేసుకోవాలన్నారు. మలేరియా దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. మలేరియా వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎం. సంపూర్ణ దేవి, హెచ్‌వీ మెరీనా,ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సస్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్‌లు ఏఎన్ఎంలు, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రయోజనాల విషయంలో రాజీ వద్దు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)**

నెల్లూరులో ఎక్కడ అన్యాయంగా జరిగినా ఎక్కడ అన్యాయంగా జరిగినా పోరాడాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రజా సంఘాలకు శుక్రవారం పిలుపునిచ్చారు. మనుబోలు మండలం చెర్లోపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభించారు. సోమిరెడ్డికి ఆత్మీయ ఆహ్వానం పలికిన చెర్లోపల్లి వాసులకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి యవత, విద్యావంతులందరూ కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, పేదలకు అన్యాయం జరిగితే మీరంతా అండగా నిలవాలన్నారు. వైసీపీ పాలనలో జిల్లాలో ఇద్దరు అమాయక దళితులు అకారణంగా ప్రాణాలు కోల్పోయారన్నారు. మర్రిపాడులో ఇద్దరు దివ్యాంగులు పోలీసుల వేధింపులతో ప్రాణాలు విడిచారు. అలాంటి ఘటనలు జరిగినప్పుడు దళిత సంఘాల నాయకులు ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్ ప్రాణాలు కోల్పోయిన సమయంలో నేను ఢిల్లీ వెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిశాను. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఊరుకోలేదన్నారు. మర్రిపాడులో దివ్యాంగుల మృతికి కారణమైన ఎస్సైపై డీజీపీకి ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయించానన్నారు. సర్వేపల్లిలో గిరిజనులకు చెందిన 6.21 ఎకరాలను పెద్ద రెడ్లు కబ్జా చేస్తే సంఘాలు ఏం చేస్తున్నాయి. వావిలేటిపాడులో ఏడుగురు దళితులకు చెందిన రూ.30 కోట్లు విలువ చేసే ఐదు ఎకరాల భూమి ఓ పెద్ద మనిషి కబ్జా చేస్తే నేను పోరాటం చేసి బాధితులకు ఇప్పించాను. పేదల హక్కుల కోసం ప్రజా సంఘాలు పోరాడాలి. వారికి అండగా నేను ఉంటాను. ఈ విషయంలో రాజీ ప్రసక్తే లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుంటుంది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలును జగన్ రెడ్డి ఆపేశారు. దళితుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఎస్సీ కార్పొరేషన్ ను మూతవేసినా ఎవరూ స్పందించలేదన్నారు. హక్కుల కోసం పోరాడటానికి అందరూ సిద్ధంగా ఉండాలి, ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు.







# రిటైర్డ్ ఉద్యోగులకు పాత పద్ధతిలో అదనపు పింఛన్ ఇవ్వాలి

**రావలసిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలి**
**రెవెన్యూ ఉద్యోగులకు వేగవంతమైన పని తీరుకు తగిన శిక్షణ ఇవ్వాలి**
**ఏపీ జెఏసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు పాత పద్ధతిలో అదనపు పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలులోని రెవెన్యూ భవన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు నాయుడు పాలనలో రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు పింఛను ను 75 సంవత్సరాలు దాటిన వారికి 17%, 70 సంవత్సరాలు దాటిన వారికి 10 శాతం ఇచ్చారన్నారు. అయితే తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం అదనపు పింఛన్లలో కోత విధించింది అన్నారు. 75 సంవత్సరాలు దాటిన వారికి 12 శాతం, 70 సంవత్సరాలు దాటిన వారికి ఏడు శాతం వంతున కోత విధించింది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ కష్టాలు తీరుతాయని భావించిన రిటైర్డ్ ఉద్యోగులకు ఇప్పటివరకు ప్రభుత్వం ఎటువంటి తీపి కబురు చెప్పలేదు అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 75 సంవత్సరాల దాటిన రిటైర్డ్ ఉద్యోగులకు 17%, 70 సంవత్సరాలు దాటిన రిటైర్డ్ ఉద్యోగులకు 12 శాతం వంతున అదనపు పింఛన్ ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వం నుండి రావలసిన అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు తగిన సమయం, శిక్షణ, నిధులు కేటాయించాల్సిన అవసరం ప్రభుత్వం పైన ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవిన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశానికి ముందుగా జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గావ్ వద్ద భారతీయ పర్యాటకులపై ముష్కరుల దాడిని ఖండించారు. భారత ప్రభుత్వం దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కఠినమైన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు. దాడిలో మృతి చెందిన భారతీయ పర్యాటకులకు ఘనంగా నివాళులర్పించారు. ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రావు, కార్యదర్శి ఆర్ వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలు జీవనోపాధికి టిఫిన్ హోటల్ ఏర్పాటు

**దివ్యాంగురాలు నాగలక్ష్మికి సూర్యశ్రీ ట్రస్ట్ అండ**
**మండవ మురళీకృష్ణ**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రకాశం భవనం అన్న క్యాంటీన్ దగ్గర అంబేద్కర్ భవన్ రోడ్డులో దివ్యాంగురాలు నాగలక్ష్మి కి టిఫిన్ హోటల్ ఈరోజు సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ప్రారంభించారు. ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష మాట్లాడుతూ నాగమణి కి ఒక కాలు లేదని ఇద్దరు పిల్లలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది మా ట్రస్ట్ మా ట్రస్ట్‌ను ఆశ్రయించింది వెంటనే ఆమె జీవనోపాధికి ప్రవాస భారతీయులు తాటిమెట్ల నాగ ఉదయ్ కిరణ్ 50,000 విజయ జ్యోతి 25,000 కిరణ్ 20,000 మరొక ఒక్క దాత సహకారంతో లక్ష అయిదు వేల రూపాయలు (1,05,000)తో టిఫిన్ హోటల్ ఏర్పాటు చేశామని దీని ద్వారా ఆమె కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనోపాధి పొందాలని కోరారు. ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరముల నుంచి సూర్య శ్రీ ట్రస్ట్ ఎంతో మంది పేదలకు జీవనోపాధికి పేద విద్యార్థులకు ఫీజులకు ఆర్థికంగా అండగా ఉందని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్ట్ చైర్ పర్సన్ షేక్ షహనాజ్, సినీ నటులు దన్నారపు మస్తాన్‌రావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.






# ఉగ్రవాదులు చేసిన అమానుష దాడులను యావత్తు ప్రపంచమంతా ఖండించాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల చేసిన అమానుష దాడులను యావత్తు ప్రపంచమంతా ఖండించాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ దాడిని ఖండిస్తూ సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల సాగర్ హోటల్ సెంటర్ నందు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వాయించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు,, కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో 28 మరణించడం బాధాకరవున్నారు. మరణించిన వారి కిసంతాపాన్ని వారికుటుంబాలకు సిపిఎం,సానుభూతి తెలియజేస్తుందని అన్నారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులు గత నెల రోజుల క్రితం దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని నిఘా వర్గాల ద్వారా తెలిసినప్పటికీ తెలిసినప్పటికీ పర్యాటకులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.. ఉగ్రవాద చర్యలు అణచడానికి తీసుకున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్నారు భద్రత కల్పించడంలోకల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం ఉందని అన్నారు. ఆర్టికల్ 371 35ఏ రద్దు చేస్తే ఉగ్రవాద ఘటనలు జరగకుండా ఆగిపోతాయని ప్రజలను నమ్మించి కాశ్మీర్లో కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడానికి మోడీ మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు.. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఓదార్చాల్సింది పోయి ఈ ఘటనను కూడా రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నది. నరేంద్ర మోడీ రానున్న బెంగాల్, బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఉన్నారు.మరణించిన వారి కుటుంబాలు ఓదార్చడానికి ఏమాత్రం ప్రయత్నం చేయలేదు అన్నారు.. ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.. మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని అన్నారు.. హిందూ ముస్లిం భాయి భాయి ఐక్యంగా ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాలన్నారు. ఉగ్రవాద ఎవరైతే ఈ దాడులకు పాల్పడ్డారో వాళ్లు తక్షణమే అరెస్టు చేయాలని, శిక్షించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తూ వారి కుటుంబాలకి సానుభూతిని సంతాపాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీ రమేష్, కె రమాదేవి, కాలం సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు వై సిద్దయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నగర నాయకులు జి ఆదిలక్ష్మి, టి మహేష్, పార్టీ సీనియర్ నాయకులు దామా శ్రీనివాసులు, మారెళ్ళ సుబ్బారావు, స్థానికులు, పార్టీ నాయకులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రభుత్వాలే గుర్తించి ఆదుకోవాలి

**మిడసల మల్లికార్జునరావు సత్కార సభలో అన్న నల్లూరి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

స్థానిక ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూమ్ ఆవరణలో శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ నటులు మిడసల మల్లికార్జునరావు అభినందన సభను ఘనంగా నిర్వహించారు. సభకు కనమాల రాఘవులు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు అన్న మాట్లాడుతూ కళాకారులను ప్రభుత్వాలే గుర్తించి పురస్కారాలను ఇవ్వడం అనేది నూటికి నూరు పాళ్ళు నిజం అని, అందునా మిడసలకు ఈ పురస్కారం రావడం అభినందనీయం అన్నారు.ప్రముఖ నటులు డా.పరాంకుశం కేశవా చార్యులు మాట్లాడుతూ పౌరాణిక నాటకాలను ప్రజలు మెచ్చే విధంగా చేయడం, చేయించడం లో మిడసల అభినందనీయుడని కొనియాడారు.నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ, అధ్యక్షులు మాట్లాడుతూ కార్యకర్త గా పనిచేస్తూ ఉంటాడని ప్రశంసించారు.నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ మాట్లాడుతూ మల్లికార్జునరావు కళాకారులనందరినీ ఏకం చేసి ముందుకు సాగుతూ ఉంటాడని తెలిపారు. డా.నూనె అంకమ్మరావు జాతీయ అధ్యక్షులు కళామిత్రమండలి (తెలుగు లోగిలి)శ్రీ కుర్రా ప్రసాద్ బాబు, అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి పక్షాన మిడసలను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సివియన్ రీడింగ్ రూమ్ క్లబ్ అధ్యక్షులు ఈదుపల్లి గుర్నాధం, కార్యదర్శి కె రాధాకృష్ణ, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్ , సింహాద్రి జ్యోతిర్మయి,యు.వి.రత్నం తదితరులు మిడసల సేవలను కొనియాడారు. సభకు ముందు రాజేష్ దంపతులు పాడిన పాటలు,చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్యాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కోప్పోలు వెంకటేశ్వర్లు,మెడబలిమి సాంబశివరావు,దామవరపు ముసలయ్య, కోవెలకుంట్ల బాలకోటయ్యలు నిర్వహణ సహకారాన్ని అందించారు. మిడసల మాట్లాడుతూ తనను ఇంత ఘనంగా సత్కరించిన కళాకారులు, కవులు, క్లబ్ సభ్యులు, ఇతరులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# ఉత్తమ ఎంపిటీసీగా పామూరు 2 ఎంపిటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాలు సందర్భంగా జిల్లా ఉత్తమ ఎంపీటీసీగా జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన పంచాయతీరాజ్ వేడుకల్లో పంచాయతీరాజ్ వ్యవస్థాపన జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్ర చారి చేతుల మీదుగా ఉత్తమ ఎంపీటీసీగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అవార్డుకు ఎంపికైన జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి




**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)**

మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయటానికి అందరూ కొత్తగా ఆలోచించాలని, మురికి నీటిని నిలువలను పూర్తిగా నిర్మూలించాలని, సైడ్ కాలవలలో మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్త చెదారాలు వేయకుండా అందరూ వ్యక్తిగతంగా ఆలోచించి సహకరిస్తే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు కృష్ణ చైతన్య, మల్లికార్జున రావు, రవి కిరణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుబ్బారావు, ఆరోగ్య విస్తరణ అధికారి సురేష్ బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, జ్యోతి, సుజాత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌కు అనుగుణంగా బేళ్ళు తీసుకొని రావాలి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)**

పొగాకు బోర్డ్ ఒకటో వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి విశ్వశ్రీ, పొగాకు బోర్డ్ సెక్రటరీ దీవి వేణుగోపాల్ , తేలిక నేలల ప్రాంతీయ అధికారి లక్ష్మణ్ వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు వేలం జరిగే విధానాన్ని పరిశీలించి బయ్యర్లు రైతులకు మంచి ధరలు ఇవ్వాలని, అదేవిధంగా రైతులను ఉద్దేశిస్తూ వారు ప్రస్తుత మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని వేలంలో వెళ్లే బేళ్ళు మాత్రమే తీసుకొని రావాలని పొగాకు రైతులకు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పొగాకు ఉత్పత్తిని వివరించారు. పొగాకు బోర్డు ఎప్పుడు రైతుల మంచి కోసమే పనిచేస్తుందని, వేలం కేంద్రాలకు వచ్చే ముందు పొగాకు బేల్స్ సరిచూసుకొని తేమ, వేడి లేకుండా చూడాలన్నారు. రైతు సోదరులు గ్రేడింగ్ చేయాలని, గ్రేడింగ్ సరిగా చేయకపోతే మార్కెట్ జరపటం కష్టమని చెప్పారు. అనంతరం పొగక బోర్డ్ కంపెనీ ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నో బిడ్‌లు తగ్గేలా చూడాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, పొగాకు రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలే




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)
బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే సహించేది లేదని ఎస్ఐ అనుక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారూ ప్రాంతంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని, మద్యం సేవించడం చట్టరీత్య నేరమని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా నడిపినట్లైతే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

## కానిస్టేబుల్ మృతి కావలి ఎమ్మెల్యే కావ్య సంతాపం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)
అనారోగ్యంతో కావలికి చెందిన కానిస్టేబుల్ చనిపోయిన విషయం తెలిసిందే. ఆయన భౌతికాయానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తపరిచారు. మీరు అధైర్య పడవద్దని అన్ని విధాల కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## వైసీపీ మండల కన్వీనర్‌గా మల్లికార్జున్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 25)
పొన్నలూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా పైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దుద్దుగుంట మల్లికార్జున్ రెడ్డి శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, వైసిపి పిఏసి సభ్యులు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌కి, వైసిపి ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో అందజేత





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఏప్రిల్ 25)
ముఖ్యమంత్రి ఆదేశానుసారం యర్రగొండపాలెం మండలానికి చెందిన దివ్యాంగుడైన వెన్న వెంకట్‌రెడ్డికి వారి జీవనాధారం కోసం ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో ఇవ్వవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. సదరు ఆదేశాలను అనుసరించి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా గనులు, దివ్యాంగుల శాఖ సమన్వయంతో సదర ఆటోను కొనుగోలు చేసి, లబ్ధిదారుడికి కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ ఏడి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జి అర్చన, ముఖ్య ప్రణాళిక అధికారి, సమాచార సాంకేతిక అధికారలు, తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి

## కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)
మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో మలేరియా నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీ ఒంగోలు కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ప్రతిఏటా ఏప్రిల్ 25వ తేదీన మలేరియా నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది మలేరియా నివారణ మనందరి బాధ్యత అన్న నినాదంతో జరుపుతున్నామన్నారు. మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా వ్యాధి నిర్ధారణ, సకాలంలో చికిత్స వంటి వాటితో నియంత్రించవచ్చున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ సౌకర్యాలు, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదన్ రావు, కృష్ణారావు, పవన్, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన

### దాడిని తీవ్రంగా ఖండించిన సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు

(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 25)
జమ్ము కాశ్మీర్‌లోని పెహల్గాం టూరిస్ట్ స్పాట్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీల ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని కమిటీ ఆఫీసులో కొవ్వొత్తుల నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను దేశాన్ని విచ్ఛిన్నం




చేయడానికి పాకిస్తాన్ అనుకూల టెర్రరిస్టులు ఈ దారుణ ఘాతకానికి పాల్పడ్డారని కేంద్ర ప్రభుత్వం వెంటనే కఠిన నివారణ చర్యలు చేపట్టాలని, ఉగ్రవాదులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ భాయి భాయి అని నినాదాలు నిందితులను ఊరి తీయాలని చేశారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ర్యాలీ నిర్వహించిన ముస్లిం జేఏసీ

### హిందూస్తాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు

(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 25)
జమ్ము కాశ్మీర్‌లోని పెహల్గాం టూరిస్ట్ స్పాట్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ కంభం అఖిలపక్ష పార్టీలు, జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో కంభం పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జామియా మస్జీద్ నుండి బస్టాండ్ మస్జీద్ వరకు భారీ ప్రజాశాంతి నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి పాకిస్తాన్ అనుకూల టెర్రరిస్టులు ఈ దారుణ ఘాతకానికి పాల్పడ్డారని, కేంద్ర ప్రభుత్వం వెంటనే కఠిన నివారణ చర్యలు చేపట్టాలని, ఉగ్రవాదులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ భాయి భాయి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు, జేఏసీ నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.







## తిరుపతి అన్నమయ్య జిల్లాల ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి సమావేశం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)
తిరుపతి అన్నమయ్య జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం తలకోనలో ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లతో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి అపస్మా ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు అందరూ హాజరై ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చంద్రశేఖర్ రెడ్డి తో చర్చించారు. సమస్యలు అధిగమించే దిశగా పరస్పర సహకారంతో ముందుకు పోవాలని నిర్ణయించారు. ప్రైవేట్ స్కూల్ సమస్యలు పరిష్కారంలో తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారికి తెలియజేశారు. అనంతరం మదనపల్లెలోని విద్యాసంస్థల అధినేత రఘునాథరెడ్డి, అన్నమయ్య జిల్లా కలికిరిలోని విద్యాసంస్థల అధినేత ఆదినారాయణరెడ్డి, తిరుపతి బాకరాపేట జనార్దన్ రెడ్డిలకు డాక్టరేట్ రావడంతో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు.







# కాశ్మీర్ హమారా హై..పాకిస్తాన్ షర్మనా హై



ఉగ్రవాద దాడిలో ఏరులై పారిన
ప్రతి భారతీయుడు రక్తపు బొట్టుకు లెక్క చెబుతాం
జాతి సమైక్యతకు భంగం కలిగించే పిచ్చి కుక్కలను
తరిమికొడదాం
భారత్ మాతా కి జై
జనసేన నాయకులు కిషోర్ గునుకుల



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)

రాష్ట్రంలో ఉగ్రవాద దాడిలో మరణించిన కుటుంబాలకి వారు లేని లోటు తీర్చలేకపోయినా భవిష్యత్తు రక్షణ తమ తోడుగా ఉన్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కూటమి నాయకులు తెలిపినట్లు జనసేన నాయకులు కిషోర్ గునుకుల అన్నారు. కూటమి మంత్రులు ఉగ్రవాద చర్యకు బాధ్యత వహిస్తూ భవిష్యత్తు రక్షణ భుజాలపై మోస్తామని మధుసూదన్ పాడి మోసినట్లు తెలిపారు. పాహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన భారతీయులకు సంతాప దినాలుగా ఈ మూడు రోజు ప్రకటించాలని అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మేరకు శుక్రవారం నెల్లూరు రూరల్ మద్రాసు బస్టాండ్ వద్ద జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనలతో జనసేన నాయకులు మానవహారంతో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీవ్ర అస్వస్థతతో కదలలేని పరిస్థితి ఉన్నప్పటికీ దేశభక్తిని పార్టీ బాధ్యతను ముందుకు నడిపించాల్సిందిగా అనుక్షణం ఫోన్ చేస్తూ జిల్లాలో మూడు రోజుల సంతాప సభలను ముందుకు నడిపించిన జిల్లా బాధ్యులు చైర్మన్ వేములపాటి అజయ్ స్ఫూర్తిని ముందుకి తీసుకెళ్తామన్నారు. మతం కనుక్కొని మరీ మారణ హోమం సృష్టించిన పాకిస్తాన్ తీవ్రవాదులకు కూటమి ప్రభుత్వం సరైన సమాధానం చెబుతుందన్నారు. పవన్ కళ్యాణ్ తెలిపినట్లుగా మూడు దశాబ్దాల కిందట అంతమైందని అనుకున్నా పాకిస్తాన్ ఉగ్రవాదం దేశ మంచితనాన్ని చేతకానితనంగా అనుకుంటూ ఇంకా ఉందన్నారు. దీనికి ప్రతిచర్య తప్పనిసరిగా ఉంటుంది. జీవితకాలం దీన్ని గుర్తుంచుకుంటామని తెలిపారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో సింధు జలాల ఒప్పందం విషయంలో పాకిస్తాన్ దౌత్య కార్యాలయాలపై చర్యల మొదలయ్యాయన్నారు. మరే ఇతర భారతీయ కుటుంబాలకి ఈ విధంగా జరగకుండా చర్యలు ఉండబోతున్నాయి. ఉగ్రవాదుల ఉన్మాద బాధను చాలా దగ్గరగా జిల్లాలో కావలి నియోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కుటుంబ సభ్యుల ద్వారా ప్రత్యక్షంగా చూసామన్నారు. మరే ఇతర భారతీయుడికి ఇటువంటి పరిస్థితి కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఉగ్రవాద దాడిలో ఆశువు బాసిన ప్రతి భారతీయుల ఆత్మ శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఈ విపత్తును ఎదుర్కొనే ధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కిషోర్ గునుకుల, జమీర్, కృష్ణారెడ్డి, పావుజెన్ని చంద్రశేఖర్, సుధా మాధవ్, శ్రీపతి రాము, గుర్రం కిషోర్, ప్రసాద్ యాదవ్, ఈగి సురేష్, రాజేష్, పేనేటి శ్రీకాంత్, యాసీన్, పవన్, ఆబిద్, వెంకీ, పోలయ్య, మహేష్ శర్మ, నజీర్ బాషా, వెంకటేశ్వర్లు, హరిరెడ్డి, ఇతర జనసైనికులు, వీర మహిళలలు, తదితరులు పాల్గొన్నారు.

# గొబ్బూరులో భూసార పరీక్షలు
# నమూనా సేకరణ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 25)

మండలంలో గొబ్బూరు గ్రామంలో రైతులకు భూసార పరీక్షలు - నమూనా సేకరణ , ప్రయోజనాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కె .బుజ్జి బాయి మాట్లాడుతూ భూమి యొక్క సారాన్ని పరీక్షించి తెలుసుకోనే పద్ధతిని భూసార పరీక్ష అంటారు. భూమి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ మొక్క పెరుగుదలకు, దిగుబడిని అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. రైతు నేల యొక్క పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం వలన నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకొని మంచి దిగుబడులు ఇచ్చే పంటను పండించడానికి అవకాశం ఏర్పడుతుంది. వేసిన పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనపుడు భూసార పరీక్ష ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గినాయో ఆ పోషకాలను మాత్రమే నేలకు అందించడం వలన పంట మంచి దిగుబడిని అందించడమే కాక నేలకు అందించే పోషకాల ఖర్చును బాగా తగ్గించుకోవచ్చు. దీని ద్వారా పంటపై పెట్టే పెట్టుబడి తగ్గటమే కాక మంచి దిగుబడుల వలన మంచి ఆదాయం పొందవచ్చు. వంట పండించడానికి నేలకు సరిపడ పోషకాలను అందించటం వలన నేల: వాతావరణంలో ఏర్పడే దుష్పరిణామాలను అరికట్టడమేకాక భవిష్యత్ తరాలకు పంట పండించడానికి అనుకూలమైన మంచి నేలను అందించగలుగుతాము. నేలలోని కొంత మట్టిని సేకరించి రసాయన పద్ధతుల ద్వారా లేదా ఇతర విశ్లేషణ పద్ధతుల ద్వారా పరీక్షించటం వలన నేలలో మొక్కకు కావాల్సిన పోషక పదార్థాలు ఏవి పాళ్లలో ఉన్నాయో తెలుకోవచ్చు. నేలలో ఉన్న సత్రజని, బాస్వరం, పొటాషియం మొదలైన పోషక పదార్థాలను మొక్కలు సేకరించటం వలన భూసారం తగ్గుతూ ఉంటుంది. అందువలన పంటను వేసే ముందే మట్టి నమూనా పరీక్షించటం ద్వారా ఆ నేలలో తగ్గిన పోషకాలను తెలుసుకొని పంట వేసినప్పుడు తగ్గిన పోషక పదార్థాలను ఎరువుల రూపంలో అందిస్తే సరిపోతుంది.

**ప్రయోజనాలు :** మట్టి పరీక్షలో ఆమ్ల, క్షార సూచిక లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, లభ్యభాస్వరం, లభ్య పోటాషియం మొదలైనవి ఏ నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకోవటం వలన నాటిన పైరుకు వయసును బట్టి, కాలాన్ని బట్టి అవసరమైన ఎరువులను సరైన పాళ్లలో అందించవచ్చు. ఈ పరీక్షల వలన ఆమ్లగుణం ఉన్న నేలలను సున్నంతో, క్షారగుణం ఉన్న నేలలను జిప్సంతో బాగుచేసుకోవచ్చు. పొలం నుంచి మట్టి నమూనా సేకరణ: మట్టి నమూనాను భూమి విస్తీర్ణాన్నిబట్టి, వాలును బట్టి, రంగును బట్టి అవసరమయినని నమూనాలను సేకరించవలసి ఉంటుంది. ఒకటి నుంచి ఐదు ఎకరాల భూమిని ప్రామాణికంగా తీసుకొని భూమిలో పలుచోట్ల ఉన్న మార్పులను బట్టి మట్టి నమూనాలను సేకరించాలి.

**భూసార వివరాలు :** నేల మానవునికి ప్రకృతి సిద్ధంగా లభించిన గొప్ప సంపద. పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు కొంత పరిమాణంలో నేలలో సహజంగా వుంటాయి. అయితే వీటిలో ఎంతో వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. నేలలో పోషకాలు ఎంత లభ్యమవుతున్నాయో. వేయదలచిన పైరుకు ఎంత అవసరమో నిర్ధారించి ఎరువులు వాడాలి. కావున భూసారాన్ని పరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశ్యము: నేలలో సహజంగా వున్న పోషకాల స్థాయిని తెల్పుకొని, వేయబోవు పంటలకు ఎరువుల మోతాదులను నిర్ణయించుటకు చౌడు, ఆమ్ల గుణాల స్థాయిని నిర్ధారించి సంచేయుటకు, తద్వారా అధిక దిగుబడులు సాధించడానికి.

భూసార నమూనాల సేకరణ

పొలమంతా ఒకే రకంగా వున్నప్పుడు 5 ఎకరాల విస్తీర్ణానికి ఒక్క నమూనా చొప్పున తీయాలి. మట్టి నమూనా తీయదల్సిన పొలంలో 10 నుండి 12 చోట్ల మట్టి సేకరించాలి. మట్టి నమూనా తీయదల్సిన చోట నేలపై వున్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసివేయాలి. పార ఉపయోగించి "వి" ఆకారంలో 6-8 అంగుళాలు (15 సెం.మీ.) అంటే నాగటి చాలంతా గుంత తీయాలి. పై నుంచి దిగువ వరకు ఒకే మందంలో పలచని పొరవచ్చే విధంగా మట్టిని తీయాలి. ఇలా అన్ని చోట్ల నుండి సేకరించిన మట్టిని గోనెపట్టా, పాలీదీన్ పట్టా లేదా గట్లమీద వేసే మట్టి గడ్డలు చిదిమి బాగా కలిపి చతుర్థ ప్రాకారంగా పరచి నాలుగు సమ భాగాలుగా విభజించాలి. ఎదురు, ఎదురుగా ఉన్న 2 భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని తీసివేయాలి. మరల నాలుగు భాగాలుగా చేయాలి. ఈ విధంగా అరకిలో మట్టి నమూనా మిగిలే వరకు చెయ్యాలి. పండ్ల తోటలు వేయదలచిన పొలంలో చదునుగా ఉన్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అందులో 3 అడుగుల గొయ్యితీసి ప్రతి అడుగుపై నుండి క్రిందికి ఒక్క మట్టి నమూనా చొప్పున సేకరించి వివరాలతో పరీక్షా కేంద్రానికి పంపాలి. నమూనాను శుభ్రమైన గుడ్డ సంచిలో గాని, ప్లాస్టిక్ సంచిలో గాని నింపాలి. సంచి లోపల రైతు పేరు, తండ్రి పేరు, గ్రామం, సర్వే నంబరు, వేయదలచిన పంట మొదలగు వివరాలతో మట్టి నమూనాను దగ్గరలో వున్న భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి. మట్టి నమూనా సేకరించటంలో మెళకువలు: చెట్ల క్రింద, గట్ల ప్రక్కన, కంచెల వద్ద, కాలిబాటలో నమూనాలు జాతీయకూడదు. బాగా సారవంతమైన చోట్ల, మరీ నిస్సారవంతమైన చోట్ల మట్టిని కలిపి తీయకూడదు. సమస్యాత్మక భూముల్లో సమూనాలు విడిగా తీయాలి. రసాయన ఎరువులు వేసిన 45 రోజుల లోపు నమూనాలు తీయకూడదు. నమూనా తీసేటప్పుడు. నేలపై నున్న ఆకులు చెత్తాచెదారము తీసివేయాలి. నీరు నిలిచి బురదగా వున్న నేల నుండి నమూనా తీయకూడదు. తప్పని సరిగా తీయవలసి వచ్చినప్పుడు నీడన అరబెట్టి పరీక్షా కేంద్రానికి పంపించాలి. మెట్ట/ఆరుతడి సేద్యంలో పైరు పెరుగుతున్న సమయంలో నమూనా తీయవలసినపుడు వరుసల మధ్య నుండి నమూనా సేకరించాలి. చౌడు భూముల్లో 0-15 సెం.మీ., 15-30 సెం.మీ. లోతులో రెండు నమూనాలు తీయాలి. వ్యవసాయ యాంత్రికరణ పై ఇన్స్ట్రక్షన్ చేయడం జరిగింది. 2024-2025 రబీ కరువు లిస్టుని ప్రదర్శించడం జరిగింది. రైతులందరూ తమ పేర్లు ఉన్నాయా లేవా అని ఆ లిస్టు చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కె బుజ్జి బాయి, రైతులు పాల్గొనడం జరిగింది.

# నెల్లూరులో ప్రేమ జంట ఆత్మహత్య



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు పట్టణంలో ప్రేమ జంట మృతి కలకలం రేపింది. జోసఫ్ రత్నకుమారి తూర్పుగోదావరి జిల్లా నాలుగు రోజుల కిందట పట్టణంలోని రైల్వే ఫీడర్స్ రోడ్డులోని సింహపురి హోటల్లో గదికి తీసుకునింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం రూమ్ నుంచి దుర్వాసన రావడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రూము తలుపులు పగలగొట్టి కుళ్ళిన మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా మీరు గత మూడు రోజుల కిందట పురుగుల మందు తీసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జిజిహెచ్ హాస్పిటల్‌కు పంపించారు.

## శ్రీవారికి మేల్ చాట్ వస్త్ర సమర్పణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

శ్రీగిరిలో మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందంచే వీణా వాదనం సంగీత కార్యక్రమం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సుప్రీత్ బాలాజీ మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేయడంతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన బాలాజీని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు , ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి అభినందించారు. శనివారం శ్రీగిరిలో మద్దులూరి బృందంచే వీణా వాదనం ఈ నెల 26వ తేదీ శనివారం సాయంత్రం 7 గంటలకు శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందంచే వీణా వాదనం సంగీత కార్యక్రమం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## పొదిలి యుపీహెచ్‌సీలో క్షయ పరీక్షలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 25)



నూతన సాంకేతిక విధానాలపై వైద్య సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ వైద్యులు శరత్ అన్నారు. శుక్రవారం యుపీహెచ్‌సీలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. యుపీహెచ్‌సీలో పనిచేసే ఆశా, ఏఎన్‌యం, ఇతర సిబ్బందికి సీవై టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు, ఎస్టిఎస్ నాగరాజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ కుటుంబానికి ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)

ఒంగోలు నగరం రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని 27వ డివిజన్‌కి చెందిన రేషన్ డీలర్ గండికోట శివ అనారోగ్యంతో మరణం చెందారు. వారి కుటుంబ సహాయార్థం నగరంలోని రేషన్ డీలర్స్ అందరూ కలిసి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు చేతుల మీదగా రూ.1,00,000/- అమౌంట్‌ని వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రేషన్ డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెజవాడ మురళీకృష్ణ, సెక్రటరీ నందూరి చంద్ర, ట్రెజరర్ సోమిశెట్టి శ్రీనివాసరావు, నగరంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకి స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)



అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానించేందుకు శుక్రవారం ఢిల్లీ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సాదర ఆహ్వానం పలికారు. ఇతర నాయకులతో కలిసి ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఎం చంద్రబాబునాయుడు కు ఎంపీ వేమిరెడ్డి స్వాగతం పలికారు.

# ఆత్మకూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)**

వచ్చేనెల 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి ముందస్తుగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆత్మకూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద హెలీప్యాడ్, నారంపేట ఎంఎస్ఎంఈ పార్క్ వద్ద హెలిపాడ్ స్థలాలను, కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. నారంపేట వద్ద పైలాన్ ఆవిష్కరణ ఏర్పాట్లపై ఏపీఐఐసీ అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే నెల్లూరు పాలెం గిరిజన కాలనీలో మంత్రి పర్యటించారు. స్థానిక రామాలయంలో గిరిజన ప్రజలు, యువతతో మంత్రి మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా వేదిక ఏర్పాటు కోసం ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు మెట్ట ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నారంపేట వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 50 ఎం ఎస్ ఎం ఈ పార్కులను ఆత్మకూరు నుంచి సీఎం ప్రారంభించినట్లు చెప్పారు. నారం పేట ఎం ఎస్ ఎం ఈ పార్క్ వద్ద విద్యుత్, రోడ్లు, తాగునీరు మొదలైన మౌలిక వసతులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి ఆత్మకూరులో పర్యటిస్తున్నారన్నారు. ఆత్మకూరులోని గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ఒకటి, రెండు గిరిజనుల నివాసాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని, ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తరఫున సీఎం భరోసా కల్పించనున్నారని ఆనం పేర్కొన్నారు. మే 1న మేడే కార్మిక దినోత్సవం పురస్కరించుకొని కార్మికులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమై వారికి శుభాకాంక్షలు తెలుపనున్నారని, కార్మికులతో మమేకమై వారి సమస్యలను ముఖ్యమంత్రి తెలుసుకుంటా రన్నారు. ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్లో నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి ముఖ్యమంత్రి పరిష్కారం చూపనున్నారని చెప్పారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ఒక గంటపాటు సుమారు 300 నుంచి 400 మంది కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకుంటారని, ముఖ్యమంత్రి సలహాల మేరకు తెలుగుదేశం పార్టీకి ఆత్మకూరును కంచుకోటగా నిలిపేందుకు కృషి చేస్తాం మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. సీఎం కార్యక్రమం పూర్తి వివరాలు త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రకటిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఏపీఐఐసీ జడ్ ఎం శివకుమార్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డీఎస్పీ వేణుగోపాల్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.







## గోదాములను తనిఖీ చేసిన డీఆర్వో బి చిన ఓబులేసు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 25)**

జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు స్థానిక మామిడిపాలెంలోని ఈ.వి.ఎం. గోదాములను తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా శుక్రవారం ఈ గోదాములను సందర్శించారు. ఈ ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రత, వాటికి సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. గోదాము షట్టర్లకు వేసిన తాళాలు, వాటి సీలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఉత్తమ సర్పంచ్‌కు శుభాకాంక్షలు

### వైసీపీ ఉలవపాడు అధ్యక్షుడు నన్నం పోతురాజు




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 25)**

ఒంగోలులోని మల్లయ్య లింగ భవన్ నందు సర్పంచుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రాచారి అధ్యక్షతన నేషనల్ లోకల్ గవర్నమెంట్ చాంబర్, ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి వారి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవములు -25 సందర్భంగా ఉలవపాడు మండలం, చాగల్లు గ్రామ సర్పంచ్ లేళ్లపల్లి లతా చంద్రశేఖర్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ , ఒంగోలు మేయర్ గంగాడ సుజాత చేతుల మీదగా ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అందుకున్న సర్పంచ్‌కి ఉలవపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉలవపాడు అధ్యక్షుడు నన్నం పోతురాజు తెలిపారు.

## ఆనం వివేకానందరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు నివాసంలో కుటుంబ సమేతంగా ఘన నివాళి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)**

స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు నివాసంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుటుంబ సమేతంగా ఘన నివాళి అర్పించారు. ఆయన వెంట మంత్రి ఆనం కుటుంబ సభ్యులు ఉన్నారు. స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి ఎప్పటికీ చిరస్మరణీయుడని వారు పేర్కొన్నారు.

## తప్పుడు సంకేతాలు పంపుతున్న వారి పై

# ఇంటెలిజెన్స్ అధ్యయనం చేయాలి

### బిజెపి నేత మిడతల రమేష్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)**

హిందువులను లక్ష్యంగా పాక్ ఉగ్రవాదులు కాల్పులు జరిపారాని మృతుల కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. మృతులలో ముస్లింలు అధికమని సామాజిక మాధ్యమాలలో పేర్లను కొందరు సర్క్యూరేట్ చేయడం అంతర్గత ప్రమాదకరమని బిజెపి నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. నెల్లూరులో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళు లర్పించారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. సింధు జలాలు ఆపితే మోడీ శ్వాస ఆపుతామని, కాశ్మీరీ నదులలో హిందువుల రక్తం పారిస్తామని లష్కరే తాయిబా చీఫ్ బహిరంగ సభలో హెచ్చరికలు జారీ చేశారు. మృతుల కుటుంబ సభ్యులు మతం అడిగి కాల్చివేశారని, బొట్టు ఉందని చంపారని కురాన్ వ్యాఖ్యలు చెప్పలేదని చంపేరని, కుటుంబ సభ్యులు విలపిస్తూ ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన వారిలో ముస్లింలు ఎక్కువ మంది ఉన్నారని, తెలుగు రాష్ట్రాలలోనే సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. నేవీ అధికారి వినయ్ నర్వాల్ మృతదేహం వద్ద అతని భార్య విలపిస్తున్న దృశ్యం భారత ప్రజల హృదయాలను కలిచివేస్తే ఆమె షూటర్ చేత చంపించిందనే వ్యాఖ్యలు మన దేశంలో వారు చేయడం ఆందోళన కలిగిస్తుంది. సోషల్ మీడియా పోస్టింగ్‌ల ద్వారా దేశ ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్న వారిపై ఇంటెలిజెన్స్ అధ్యయనం చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, సమాధి శ్రీనివాస్ యాదవ్, వెంట రామమోహన్, కృష్ణ సింగ్, తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీలో భారీగా చేరికలు

### వెంకటేశ్వరపురం 54వ డివిజన్ నుండి షేక్ పీర్ సాహెబ్ ఆధ్వర్యంలో 30 మందికి చేరిక

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 25)**

వెంకటేశ్వరపురం 54వ డివిజన్ నుంచి ప్రముఖ నాయకుడు షేక్ పీర్ సాహెబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీజేపీలో చేరికలు జరిగాయి. ఆయన నాయకత్వంలో సుమారు 30 మంది యువకులు, మహిళలు భారతీయ జనతా పార్టీలో సభ్యత్వం పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి హాజరై కొత్తగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా షేక్ పీర్ సాహెబ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు నన్ను ప్రభావితం చేశాయి. దేశాభివృద్ధి దిశగా జరుగుతున్న బీజేపీ ప్రయాణంలో భాగస్వాములమవడం సంతోషంగా ఉంది అని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు డి వెంకటేష్, శివకుమార్, రంగపట్నం శ్రీనివాసులు, పో. కురు మాధవ్, అశోక్ కుమార్, చచ్చాల ప్రసాద్, జి నరసింహులు నాయుడు, దాసరి శరవణ, ఇతర మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com